నరుచి పుట్టె. వికాసముదొలఁగి మొగము భయచిహ్నముల కాలవాలమయ్యె. నాయది కాని రూపిక నాదగ్గరనుంటయే దీనికి హేతువు.

'ఇట్టి దుస్థితిలో నేనుండ 'వీరన్నా' యన్న యజమాని కేక నా చెవులఁ బడినది. హఠాత్తుగా వినఁబడిన కేక నా మేనును గంపింపఁదొడఁగె. ఇంతటితో నా గౌరవము మాసిపోవునని నిశ్చయించితిని. అతఁడు నన్ను రూపాయనుగూర్చి ప్రశ్నించు ననుకొన్నంతనే మామకముఖము వివర్ణమైపోయె; శిరము వనతమయ్యె. "నీకు దొఱకిన రూపాయ యేదీ! దొంగా! ఎక్కడ దాఁచితివి? ఎవ్వరిదో వారి కయ్యది యియ్య నక్కఱ లేదా?" అని యాతఁ డడిగిన నే నేమి చెప్పుదునా యనుకొంటిని. యజమాని నన్నుఁ జూచి "వీరన్నా; నీవు రామస్వామి దగ్గరకుఁబోయి యీదినము పని లోనికి వచ్చునో రాఁడో కనుఁగొని రమ్మని నుడివె.

ఆ పలుకులు చెవిఁబడినంతనే యొక్క-పెద్దబరువు నాహృదయమును బాసిపోయెను. కడకు యజమానుని యాజ్ఞ యిది. ఇట్టిపను లెన్నియైనఁ జేయ సంసిద్ధుఁడనై యుంటి నను కొని సంతోషముతో బయటకు గంతువేసి యాతని దృష్టిపథమునుండి తొలఁగి పోతిని.

ఒక్కసారి నా రూపాయను జేబులో నుండి పైకిఁదీసి కన్నులారఁ జూచి సంతోషించితిని. దాని వెచ్చించి నేను కొనఁగలవస్తువుల పట్టికనూహించి యాశ్చర్యానంద నిమగ్నుఁడనైతిని. నా హృదయమునకు స్థైర్యములేదు. నాణెము లభ్యమైనందున నదృష్టవంతుఁడనని తలంచి సంతసింతునా? అదియెవ్వరిదో తెలిసికొనుటకుఁ బ్రయత్నింపకపోవుట యపరాధమని విచారింతునా? ఈవిషయముల వితర్కించుకొన్నకొలఁదిని నా దుఃఖ మభివర్ధిత మగుచుండె. నన్ను రూపాయతోఁ బట్టుకొనిన దొంగయనరా? నాకు దొఱకినది దాఁచుకొనుట నేరముకాదా? అట్లయిన నా కీనాణె మక్కఱలేదు. దాని యధికారి నన్నడిగిన వెంటనే యాతని కియ్యది యొసంగుదు. కాని, యెవ్వ రది పోఁగొట్టుకొనిరో తెలియనప్పుడు దాని నెవ్వరి కందఁజేయుదును? ఈవిధముగా వితర్కించుకొనుచు రామస్వామి సదనము సమీపించితిని.

'ఎట్లయిన సొత్తు నాకడ నున్నంత కాలము నా డెందమున కొక పెద్ద యినుప గుండు తగిలించినంత భారముగ నుండె. దుష్టఘన వ్యామోహముచే నా కీ ఘోరపరితాపము. వంగిపోయి యరిగిన రాగిదమ్మిడి దొరకినప్పుడు కలిగిన యానందమున సర్ధభాగమైనను నిప్పుడు కలుగకపోవుట యద్భుతము. ఆదమ్మిడిని తోమి సుత్తెతో బహిరంగముగ సరియొనరించితిని. 'ఆ పైస మా' దని యెవ్వరు ననలేదు; అందు రన్న భయమును లేకపోయె. నాతోడివా ద్రవ్యాభ్యధనమునకే నాపయి నీర్ష్యఁగొనిరి. ఆహా! అప్పుడంతకే మహారాజ నైతి నని యెగిరిపడితిని. ఇప్పుడో! యీ వెండిరూపాయ నా దృక్పథమునఁ బడకుండిన మేలయ్యెడిది! దీనివలన నాకానందము కాలేదు. సరిగదా లేనిపోని మనోవ్యాకులత్వ మబ్బినది. మఱల నా కెన్నఁడు నిది కనఁబడ

